మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ   ఎడిటర్ : నంద కిషోర్   సంపుటి : 08   సంచిక : 94   మంగళవారం   16 - 09 - 2025   పేజీలు: 8   వెల: 4

## యూరియాను షరతులు లేకుండా పంపిణీ చేయాలి



3లో..

## భాజపా జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డాతో

# డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర..భేటీ







### - నేత జె.పి.నడ్డాకు..ఘన స్వాగతం

(మన గళం,కర్నూలు సిటి) : భాజపా జాతీయ అధ్యక్షుడు,కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ, రసాయనాల,ఎరువుల శాఖా మంత్రి జే.పీ.నడ్డా కు ఘన స్వాగతం లభించింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఆధ్వర్యంలో ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర నేత జె.పి.నడ్డాకు ఘన స్వాగతం పలికారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువా కప్పి,సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బిజెవైఎం అధ్యక్షుడు సునీల్ రెడ్డి,కర్నూలు జిల్లా భాజపా అధ్యక్షుడు రామక్రిష్ణ,తదితరులున్నారు.



## కొరియా వార్నింగ్ కు

# దిగొచ్చిన ట్రంప్...

### విదేశీ ఉద్యోగులను నియమించుకోవచ్చంటూ సూచన

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వలస విధానంలో అనూహ్యమైన మార్పు కనబరిచారు. అక్రమ వలసల విషయంలో మొదటి నుంచి ఉక్కుపాదం మోపుతున్న ఆయన, ఇప్పుడు అమెరికా పరిశ్రమల అభివృద్ధికి విదేశీ కార్మికుల అవసరం ఉందని బహిరంగంగా ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సరైన వీసా ప్రక్రియలను అనుసరించి, అవసరమైన విదేశీ నిపుణులను నియమించుకోవాలని

2 లో..

## భారత్‌కు అండగా

# నిలిచిన రష్యా



- తమ మైత్రిని ఎవరూ విడదీయలేరన్న మాస్కో
- అమెరికా ఒత్తిళ్లను పట్టించుకోని భారత్

మన గళం డెస్క్ : భారత వస్తువులపై అమెరికా భారీగా సుంకాలు విధిస్తూ ఒత్తిడి పెంచుతున్న కీలక తరుణంలో, రష్యా తన మిత్రదేశమైన భారత్‌కు అండగా నిలిచింది. ఇరు దేశాల మధ్య ఉన్న బంధం అత్యంత దృఢమైనదని, దానిని బలహీనపరిచే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుందని మాస్కో స్పష్టం చేసింది. బయటి శక్తుల ఒత్తిళ్లకు, హెచ్చరికలకు భారత్ తలొగ్గకుండా

2 లో..

# కీర్తి స్కూల్ గోడ కూలి విద్యార్థి మృతి

- కర్నూలులో ఘటన
- మరో పదిమంది విద్యార్థులకు తీవ్ర గాయాలు... ఒకరి పరిస్థితి విషమం
- స్కూలుకు లేటుగా వచ్చారనే కారణంతో పనిష్మెంట్‌గా బయట నిలబెట్టిన యాజమాన్యం

మనగళం, కర్నూలు క్రైం : కర్నూలు నగరంలో సోమవారం దారుణ ఘటన చోటుచేసుకుంది. కీర్తి హై స్కూల్‌లో గోడ కూలి ఓ విద్యార్థి మృతి చెందగా, మరో పదిమంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సోమవారం ఉదయం కవాడి గేరిలో జరిగిన ఈ ఘటనతో నగరం ఉలిక్కిపడింది. స్థానికుల సమాచారం ప్రకారం.. స్కూలుకు ఆలస్యంగా వచ్చారన్న కారణంతో యాజమాన్యం కొందరు విద్యార్థులను పనిష్మెంట్‌గా గోడ పక్కన నిలబెట్టింది. ఈ క్రమంలో ఒక్కసారిగా గోడ కూలి రాఖీబి (5), ఖాజా మొహిద్దిన్ కుమారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి ప్రశాంత్ పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన పది మంది గాయపడగా, వారిని స్థానికులు, పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. స్కూల్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీపీఎం, సిఐటీయూ, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. నిబంధనలకు విరుద్ధంగా కీర్తి స్కూల్ నడుస్తోందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ గోడలు శిథిలావస్థలో ఉండటంతో పాటు, ప్రధాన విద్యుత్ వైర్లు కూడా పాఠశాల గోడకు ఆనుకొని ప్రమాదకరంగా ఉన్నా యాజమాన్యం స్పందించలేదని స్థానికులు విమర్శించారు. కర్నూలులో ఇలాంటి పలు స్కూల్లు ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు మాత్రం మామూలు నిర్లక్ష్య ధోరణిలో ఉన్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే అనేకసార్లు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడ్డారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరిగినా కీర్తి స్కూల్ యాజమాన్యం ఇంకా స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు.



## బొకారోలో నక్సలిజం

# అంతమైంది: అమిత్ షా



మన గళం, న్యూఢిల్లీ : ఉత్తర బొకారో ప్రాంతంలో నక్సలిజం పూర్తిగా నశించినట్లు ఇవాళ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. త్వరలో యావత్ దేశం నక్సల్స్ సమస్య నుంచి విముక్తి పొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇవాళ జరిగిన ఎన్‌కౌంటర్ వివరాలను ఆయన వెల్లడించారు. జార?ండ్‌లోని హజారీబాగ్‌లో

2 లో..

## వక్ఫ్ (సవరణ) చట్టంపై

# ఆ నిబంధన నిలిపివేత



మన గళం, న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) చట్టం 2025 మొత్తంపై స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కాకపోతే కొన్ని కీలక ప్రొవిజన్లను మాత్రం నిలిపివేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌తో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు

2 లో..

## విద్యార్థి మృతి బాధాకరం



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గోడ కూలి ఓ విద్యార్థి మృతి చెందడం తో పాటి పలువురు విద్యార్థులు గాయపడిన ఘటన పై ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి స్కూల్ గోడ కూలిన ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యార్థి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజే స్తున్నానన్నారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించిన ఎంపీ, ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం





మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు పట్టణంలో ప్రపంచ ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా మ్యూజియం ఎదురుగా ఉచిత మెడికల్ క్యాంపును కర్నూలు పట్టణ లైసెన్సుడ్ ఇంజనీర్లు అసోసియేషన్ లీసా, మోహన్ డయాబెటిక్ కేర్ డాక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలు జిల్లా పాణ్యం సిమెంట్ డిస్ట్రిబ్యూటర్ మధు, మార్కెటింగ్ డైరెక్టర్ ఎద్దుల సూర్య రెడ్డి, వేగం పెయింట్స్ ఎం.డి పీనేకపాని సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 400 పైగా కర్నూలు పట్టణ వాస్తవ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్నూల్ పట్టణ కుడా వైస్ చైర్మన్ నవ్య, కర్నూలు చాప్టర్ క్రెడాయి చైర్మన్ గోరంట్ల రమణ, ఆంధ్రప్రదేశ్ క్రెడాయి వైస్ ప్రెసిడెంట్ సాయిరాం రెడ్డి, కుడా పిఓ విజయ భాస్కర్, పాణ్యం సిమెంట్ జనరల్ మేనేజర్ కుమార్ రాజా, సిమెంట్ కంపెనీ అధికారులు, స్టీల్ కంపెనీల అధికారులు, పెయింట్ కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొరియా వార్నింగ్‌కు

# దిగొచ్చిన ట్రంప్...

కంపెనీలకు ఆయన సూచించారు. దక్షిణ కొరియా నుంచి ఎదురైన ఓ తీవ్ర హెచ్చరిక నేపథ్యంలో ట్రంప్ ఈ మేరకు తన వైఖరిని మార్చుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో ఉన్న ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్ ప్లాంట్‌పై హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు దాడులు నిర్వహించారు. ఆ ప్లాంట్‌లో పలువురు అక్రమంగా పనిచేస్తున్నారన్న సమాచారంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. ఈ దాడుల్లో భాగంగా మొత్తం 475 మంది అక్రమ వలసదారులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో అత్యధికులు దక్షిణ కొరియాకు చెందినవారే కావడంతో ఈ విషయం రెండు దేశాల మధ్య తీవ్ర దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ ఘటనపై దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ తీవ్రంగా స్పందించారు. అమెరికాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా, తమ దేశానికి చెందిన కంపెనీలు అక్కడ పెట్టుబడులు పెట్టే విషయంలో పునరాలోచించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ హెచ్చరిక అమెరికా పారిశ్రామిక వర్గాల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించింది. దక్షిణ కొరియా నుంచి పెట్టుబడులు తగ్గిపోతే అది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా ఒక కీలక పోస్ట్ చేశారు. “అమెరికాలోని సంక్లిష్టమైన పరిశ్రమలు రాణించాలంటే విదేశీ కార్మికుల సేవలు అవసరం. అవసరమైతే, చట్టబద్ధమైన వీసా ప్రక్రియలను అనుసరించి వారిని నియమించుకోవాలి. ఇది మన ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది” అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అధ్యక్ష పదవి చేపట్టిన నాటి నుంచి అక్రమ వలసలను ఏమాత్రం సహించబోమని చెబుతున్న ట్రంప్ నుంచి ఇలాంటి ప్రకటన రావడం గమనార్హం. టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ వంటి కీలక రంగాల్లో విదేశీ నిపుణుల పాత్ర అమెరికా అభివృద్ధిలో ఎంతో కీలకం. అయితే, తన కఠిన వైఖరి ఆర్థికంగా నష్టం చేకూరుస్తుందన్న ఆందోళనతోనే ట్రంప్ ఈ కొత్త ప్రకటన చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## భారత్‌కు అండగా నిలిచిన రష్యా




సహకారాన్ని కొనసాగించడంపై రష్యా విదేశాంగ శాఖ ప్రశంసలు కురిపించింది. ఓ రష్యన్ అధికారి ‘ఆర్టీ’ వార్తా సంస్థతో మాట్లాడుతూ, మాస్కోతో సంబంధాల విషయంలో భారత్ ఎటువంటి సంకోచం లేకుండా నిబద్ధతతో ముందుకు సాగుతోందని కొనియాడారు. ఇరు దేశాల భాగస్వామ్యం స్థిరత్వం, విశ్వాసం పునాదులపై నిర్మితమైందని, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. భారత ఉత్పత్తులపై అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 25 శాతం సుంకాలు విధించింది. దీనికి అదనంగా, రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లకు సంబంధించిన దిగుమతులపై మరో 25 శాతం పన్ను వేసింది. దీంతో అమెరికా మార్కెట్లోకి ప్రవేశించే భారత ఎగుమతులపై మొత్తం 50 శాతం సుంకం పడుతోంది. ఇది ప్రపంచంలోనే అత్యధికం కావడం గమనార్హం. రష్యా నుంచి చమురు కొనడం ద్వారా ఉక్రెయిన్ విషయంలో మాస్కో చర్యలకు భారత్ సహకరిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపిస్తున్నారు. అమెరికా చర్యలను భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇవి అన్యాయమైనవని పేర్కొంది. అమెరికా, యూరప్ దేశాలు కూడా రష్యా నుంచి పెద్ద మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నాయని న్యూఢిల్లీ గుర్తు చేసింది. ఈ ఒత్తిళ్లు పెరుగుతున్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్-సీవో) సదస్సుకు హాజరయ్యారు. చైనా, రష్యా నేతలతో కలిసి ఆయన ఈ వేదికపై కనిపించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.

రక్షణ ఉత్పత్తులు, అంతరిక్ష పరిశోధన, అణు ఇంధనం, సంయుక్త ఆయిల్ ప్రాజెక్టులు వంటి కీలక రంగాల్లో ఇరు దేశాల మధ్య బలమైన సహకారం ఉందని రష్యా నొక్కి చెప్పింది. ఈ బంధం జాతీయ ప్రయోజనాల ఆధారంగా రూపుదిద్దుకుందని, బయటి శక్తుల ఆదేశాలతో కాదని స్పష్టం చేసింది. మరోవైపు, భారత్‌తో వాణిజ్య చర్చల్లో పురోగతిని ఆశిస్తున్నట్లు ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

## బొకారోలో నక్సలిజం అంతమైంది: అమిత్ షా

యాంటీ నక్సల్ ఆపరేషన్‌లో మేజర్ సక్సెస్‌ను సాధించామన్నారు. సీఆర్పీఎఫ్‌కు చెందిన కోబ్రా బెటాలియన్, రాష్ట్ర పోలీసులు ఈ సక్సెస్‌లో భాగస్వామ్యులైనట్లు తెలిపారు. తలపై కోటి రూపాయల నజరానా ఉన్న నక్సల్ కమాండర్ సీసీఎం సహదేవ్ సోరెన్ అలియాస్ పర్వేశ్‌ను హతమార్చినట్లు ఆయన చెప్పారు. దీనికి తోడు మరో ఇద్దరు నక్సల్స్‌ను కూడా హతమార్చామన్నారు. రఘునాథ్ హెంబ్రమ్ అలియాస్ ఛంచాల్, బిర్సేన్ గంజూ అలియాస్ రామ్‌కేల్వాన్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆపరేషన్ ద్వారా బొకారో ప్రాంతంలో ఉన్న నక్సలిజం అంతమైనట్లు షా వెల్లడించారు. యావత్ దేశం కూడా త్వరలో విముక్తి చెందుతుందన్నారు.



## వక్ఫ్ (సవరణ) చట్టంపై ఆ నిబంధన నిలిపివేత



జారీ చేసింది. కనీసం ఐదేళ్ల పాటు ఇస్లాం మతాన్ని ఆచరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్‌గా చేయడానికి అవకాశం ఉంటుందన్న నిబంధన (సెక్షన్ 3)ని సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఒక వ్యక్తి ఐదేళ్ల పాటు ముస్లిం మతాన్ని ఆచరించడానికి ఎలా నిర్ణయించాలో ఆ నియమాలను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించేంత వరకు ఈ నిబంధనను ఆపేస్తున్నట్లు జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం తెలిపింది. సెక్షన్ 3తో పాటు 9, 14, 23, 36, 107, 108 సెక్షన్లను సుప్రీంకోర్టు నిలిపివేసింది. అలాగే కొన్ని సెక్షన్లకు మాత్రం కొంత రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. వక్ఫ్, వక్ఫ్ వాటాదారుల హక్కులను జిల్లా కలెక్టర్ వంటి ప్రభుత్వ అధికారులు నిర్ణయించడానికి అనుమతించడం అధికార విభజన సిద్ధాంతానికి విరుద్ధంగా ఉందని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం అభిప్రాయపడింది. వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజారిటీలో ఉండాలని పేర్కొంది. బోర్డులో అత్యధికంగా ముగ్గురు లేదా నలుగురు ముస్లిమేతర సభ్యులు ఉండొచ్చని సూచించింది. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ముస్లిం వ్యక్తే ఉండటం మంచిదని అభిప్రాయపడింది.

## ఎన్నికల సంఘం ప్రధాని నియంత్రణలో పనిచేస్తోంది

**- ఈసీ పూర్తిగా బీజేపీ ఎన్నికల ఏజెంట్‌గా మారిపోయిందని తీవ్ర ఆరోపణ**
**- కర్ణాటక, మహారాష్ట్రలలో జరిగిన ఓట్ల అవకతవకలను ప్రస్తావించిన షర్మిల**
**- దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం**
**- రాష్ట్రంలో నేటి నుంచి అక్టోబర్ 15 వరకు సంతకాల సేకరణ కార్యక్రమం**

మన గళం, అమరావతి : కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) పనితీరుపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతిలో బందీగా మారిందని, బీజేపీకి ఎన్నికల ఏజెంట్‌గా పనిచేస్తోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలంతా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఈసీ, పూర్తిగా బీజేపీ ప్రయోజనాల కోసం పనిచేస్తోందని షర్మిల ఆరోపించారు. కేవలం ఎన్నికల సంఘమే కాకుండా సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ ప్రధాని మోదీ గుప్పిట్లో ఉన్నాయని, ఆయన ఆదేశాల మేరకే పనిచేస్తున్నాయని విమర్శించారు. ఈ వాస్తవాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రజల ముందు ఉంచారని, ఇది నేటి భారత ప్రజాస్వామ్య దుస్థితికి నిదర్శనమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, దేశంలో జరుగుతున్న ఓట్ల అవకతవకలకు సంబంధించి కొన్ని ఉదాహరణలను ఆమె ప్రస్తావించారు. కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గంలో ఏకంగా లక్ష దొంగ ఓట్లను నమోదు చేశారని, అవన్నీ నకిలీ ఫోటోలు, పేర్లు, చిరునామాలతో సృష్టించినవేనని ఆమె ఆరోపించారు. అదేవిధంగా, మహారాష్ట్ర ఎన్నికల సమయంలో పోలింగ్ చివరి గంటలో, అంటే సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య, అనూహ్యంగా 60 లక్షలకు పైగా ఓట్లు పోల్ అయ్యాయని, ఆ ఓట్లు ఎవరు వేశారో చెప్పడానికి ఈసీ వద్ద ఎలాంటి ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ లేదని ఆమె దుయ్యబట్టారు. ఎన్నికలకు కేవలం ఐదు నెలల ముందు కోటికి పైగా కొత్త ఓట్లు నమోదు కావడం వెనుక పెద్ద కుట్ర ఉందని షర్మిల అనుమానం వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తూ, వారికి అనుకూలంగా దొంగ ఓట్లను చేర్చడం ద్వారా ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. ఈ ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పోరాటానికి సిద్ధమైందని తెలిపారు. ఈ పోరాటంలో భాగంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలందరూ ఇందులో పాల్గొని తమ మద్దతు తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



## మెగా డీఎస్సీ-2025 తుది ఎంపిక జాబితా విడుదల

**- ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్**
**- 150 రోజుల రికార్డు సమయంలో నియామక ప్రక్రియ పూర్తి**
**- ఇచ్చిన మాట ప్రకారం ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ**
**- సీఎం చంద్రబాబు తొలి సంతకంతో నెరవేరిన హామీ**
**- అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న ఫలితాలు**

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధ్యాయ అభ్యర్థుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ-2025 తుది ఎంపిక జాబితాను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఈ విషయాన్ని ఆయన తన అధికారిక ‘ఎక్స్’ ఖాతా ద్వారా వెల్లడించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, రికార్డు స్థాయిలో కేవలం 150 రోజుల్లోనే ఈ నియామక ప్రక్రియను విజయవ ంతంగా పూర్తిచేశామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్ర బాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్‌పైనే తొలి సంతకం చేసిన విషయాన్ని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ హామీని నిలబెట్టుకుంటూ, పారదర్శకంగా నియామక ప్రక్రియను ముగించినట్లు పేర్కొన్నారు. తుది జాబితా సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి అధికారిక వెబ్ సైట్ లో అభ్యర్థులకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు మంత్రి హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు. “ఈ విజయం బాధ్యత, సేవతో కూడిన ఉపాధ్యాయ వృత్తికి ఆరంభం. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి” అని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగా విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేయాలని సీనియర్ ఉపాధ్యాయులను కోరారు. ఈసారి అవకాశం దక్కించుకోలేని అభ్యర్థులు నిరుత్సాహపడొద్దని లోకేశ్ భరోసా ఇచ్చారు. “ఇచ్చిన హామీ ప్రకారం, ఇకపై ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహించడం జరుగుతుంది. పట్టుదలతో సాధన కొనసాగించండి, అవకాశం తప్పకుండా వస్తుంది” అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ మాట నిలబెట్టుకుంటూ ఇంత త్వరగా నియామక ప్రక్రియ పూర్తి చేయడంపై నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేస్తోంది.



## లిక్కర్ స్కామ్ కేసులో మూడో ఛార్జ్ షీట్

మన గళం, విజయవాడ : ఆంధ్రప్రదేశ్ లో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ మరో కీలక అడుగు వేసింది. ఈ కేసులో మూడో అదనపు ఛార్జ్ షీట్‌ను ఏసీబీ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసింది. లిక్కర్ స్కామ్ కేసులో ఇప్పటి వరకు మొత్తం 48 మందిని నిందితులుగా చేర్చగా.. 12 మందిని అరెస్టు చేసింది. ఇదే కేసులో నలుగురికి ఇటీవల ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. లిక్కర్ స్కామ్ లో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ పాత్రను తాజా ఛార్జ్ షీట్‌లో సిట్ స్పష్టంగా పేర్కొంది. ఈ స్కామ్ లో కొల్లగొట్టిన డబ్బును ఈ నలుగురి ద్వారా ఎలా మళ్లించారో ఛార్జ్ షీట్‌లో సిట్ వివరించింది. ప్రస్తుతం గుంటూరు జైల్లో బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ రిమాండ్ ఖైదీలుగా ఉండగా.. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. లిక్కర్ స్కామ్ లో వరుసగా ఒక్కొక్కరి పాత్రపై ఛార్జ్ షీట్‌లో సిట్ వివరించినట్లు తెలుస్తోంది. ఈ స్కామ్ లో నిధుల మళ్లింపుపై ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తోంది.

# మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యం

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మెరుగైన వైద్య సేవలతో కుటుంబాలను, దేశాన్ని బలోపేతం చేయడమే 'స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం లక్ష్యం అని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పోస్టర్ ను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం శక్తివంతమైన కుటుంబ నిర్మాణానికి కీలకమన్నారు. ఈ అభియాన్ ద్వారా మహిళల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, పోషకాహారంపై శ్రద్ధ చూపించడం, కుటుంబ స్థాయిలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పరచుకోవడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా సాగే ఈ కార్యక్రమంలో భాగంగా ఆయుష్మాన్ మందిరాలు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఆరోగ్యవంతమైన మహిళ అంటే ఆరోగ్యవంతమైన కుటుంబం, అదే బలమైన సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు, బాలికలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సదుపాయాలను



సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీ ఎం హెచ్ ఓ డా. శాంతి కళా, డీఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు డీఈఓ విద్యార్హతలపై జ్యుడిషియల్ విచారణ చేయించాలి




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు డీఈఓ విద్యార్హతల అనుమానాలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా విద్యాధికారులపై కూడా జ్యుడిషియల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విభాగ్ కన్వీనర్ ఎర్రిస్వామి విద్యా వ్యవస్థ దాడి తప్పిందని, గాడిలో పెట్టాల్సిన బాధ్యత మంత్రి లోకేష్ దేనని పేర్కొన్నారు. ప్రత్యేకించి కర్నూలు జిల్లాలో అనేక లోటుపాట్లు ఉన్నటువంటి పాఠశాలలను గాడిలో పెట్టాల్సినటువంటి డీఈఓ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నారా లోకేష్ తక్షణమే అన్ని జిల్లాల డీఈఓలపై వెంటనే జ్యూడిషియల్ ఎంక్వయిరీ వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వీరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి, లోకేష్ సందీప్, వాసు నాయక్, మల్లికార్జున తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## కీర్తి స్కూల్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు నగరంలో కవాడి వీధి నందు కీర్తి ప్రైవేట్ స్కూల్ గోడకులి ఒక అబ్బాయి చనిపోయాడని, కారకులైన ఆ స్కూల్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్యకు ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్, సీఐటీయూ నాయకులు రాజశేఖర్, అబ్దుల్ దేశాయ్, షరీఫ్ నగర అధ్యక్షులు అబుబాకర్ తదితరులు వినతి పత్రం అందజేశారు. విద్యార్థి చనిపోవడంతోపాటు మరో ఎనిమిది మంది చిన్నారులకు గాయాలయ్యాయని, స్వయానా తల్లిదండ్రులే పాఠశాల దగ్గరికి వచ్చి చుట్టుపక్కల వారి సహకారంతో చిన్నారులను హాస్పిటల్స్ కి తీసుకెళ్లారని తెలిపారు. అదేవిధంగా మరణించిన విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహకారాన్ని అందించాలి. తీవ్రంగా గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య పరీక్షలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయమ్మ, నాగస్వాములు, మూస,ఇంతియాజ్ ఎస్ఎఫ్ఐ నగర నాయకులు యోగి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## ప్రతి అర్జీదారుడు సంతృప్తి చెందాలి




మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్య తెలిపిన ప్రతి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 23 అర్జీలు రాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యూరియాను షరతులు లేకుండా పంపిణీ చేయాలి




మనగళం, కర్నూలు సిటీ : రైతులకు యూరియాను షరతులు లేకుండా పంపిణీ చేయాలని కర్నూలు జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ ఏ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గల మహాత్మా గాంధీ గారి విగ్రహం ముందు కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ యూరియా కొరతవల్ల రైతులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా పంటలు నష్టపోయి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వాల అసమర్థత పాలనకు నిరసనగా జాతీయ కాంగ్రెస్ పార్టీ నిరసన ద్వారా రైతుల ఆవేదనను ప్రభుత్వానికి నిరసన కార్యక్రమం ద్వారా హెచ్చరిస్తున్నామన్నారు. అనంతరం కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ టమోటా, ఉల్లి, వరి మొదలగు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. యూరియాను అధిక ధరలకు బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్న దళారులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాక్రిష్ణ, పత్తికొండ, కోడుమూరు నియోజక వర్గాల కోఆర్డినేటర్లు బి క్రాంతి నాయుడు, అనంతరత్నం మాదిగ, రాష్ట్ర ఐఎన్ టీయూసి ఫెడరేషన్ అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్సీ బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు డివి సాంబశివుడు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కే రాఘవేంద్ర రెడ్డి, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ఈ లాజరస్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్, వార్డు ఇన్చార్జులు ఎన్ సుంకన్న హుస్సేన్ బాషా, కేశవరెడ్డి, దస్తగిరి, కిషోర్ రంగస్వామి, కర్నూల్ మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు బొగ్గుల హైమవతి తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను గడువులోపు పరిష్కరించండి

- జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : అర్జీదారుల నుండి వచ్చిన అర్జీలను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ లాగిన్ లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందన్నారు. అర్జీల ఆడిట్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను అలసత్వం వహించకుండా పెండింగ్ లో లేకుండా ఎప్పటికపుడు చూడాలన్నారు. సీఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 9, కర్నూలు ఆర్డీఓ వద్ద 8, పత్తికొండ ఆర్డీఓ వద్ద 5, కలెక్టరేట్ ఏవో వద్ద 3, సర్వే ఏడి, ఏపిఐఐసి జెడ్ఎం ల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ లో ఉన్న వాటిని బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ కు రక్షణగా గోడ నిర్మించాలి : కర్నూలు నగర పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ కు రక్షణ గోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్యకు డీవైఎఫ్ఐ నగర కమిటీ నాయకులు వినతి పత్రం అందజేశారు. రక్షణ గోడ లేకపోవడం మూలంగా హెల్త్ సెంటర్ మందుబాబులకు అడ్డాగా మారిందని ఈ సందర్భంగా నాయకులు త్రాగుబోతులకు అడ్డగా మారిందని ఈ సందర్భంగా న్యూసిటీ కార్యదర్శి హుస్సేన్ బాషా,



నాయకురాలు సుకన్య ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర నాయకులు వీరేష్, వెంకటేష్,జయంతి పాల్గొన్నారు. సర్వీస్ రోడ్డు వేయించాలి: కల్లూరు వక్కెర వాగు బ్రిడ్జి దగ్గర నుండి మహావీర్ కాలనీ బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్ వరకు సర్వీసు రోడ్డు వేయించాలని సీపీఎం నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ బి నవ్యకు వినతి పత్రం అందజేశారు. మహావీర్ కాలనీ వరకు సర్వీసు రోడ్డు లేనందున రాత్రిపూట వచ్చే వాహనాలు, బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్ పైన నుండి అతివేగంతో వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప, శ్రీనివాసులు, సూర్యనారాయణ, అక్బర్ బాషా తదితరులు జేసీకి తెలిపారు

## సామూహిక మరుగుదొడ్లకు మరమ్మత్తులు చేయించాలి

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని మూడవ వార్డు బండి మెట్ట నందు సామూహిక మరుగుదొడ్లను తక్షణమే మరమత్తులు చేయించాలని సీపీఎం సీనియర్ నాయకురాలు పార్వతయ్య, నగర కార్యదర్శి వర్గ సభ్యులు, యస్ ఎం డి షరీఫ్, నాయకులు గౌస్ బాషా లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొత్తం 20 మరుగుదొడ్లు ఉండగా ఆరు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయని, దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, స్థానికులు మూస మియా,జగదీష్ ,సాయి, వీరేష్, పల్లవి,ఛాయాదేవి, ప్రమీల, మౌనిక గాయత్రిబాయి, మౌనిక బాయి,రమణ బాయి తదితరులు పాల్గొన్నారు.

## దోభీ ఘాట్ల మరమ్మత్తులు నిధులు కేటాయించాలి

మనగళం, కర్నూలు సిటీ : నగరంలోని దోభీఘాట్ల మరమ్మత్తులకు మున్సిపల్ కార్పొరేషన్ నుండి నిధులను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి గురు శేఖర్, జిల్లా ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు, కర్నూల్ న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు రాముడు, శేషాద్రి, ఓల్డ్ సిటీ కార్యదర్శి సి జయమ్మ, జిల్లా కమిటీ సభ్యులు సి ఎల్లయ్య, నగర నాయకులు మద్దిలేటి, శ్రీను, రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009 వరదలు వచ్చిన సందర్భంగా అప్పటి ప్రభుత్వం నగరంలో దోభీఘాట్ల నిర్మాణం కొరకు నిధులు కేటాయించి సంకల్ బాగు,కొత్తపేట, చిత్తారి వీధి, జమ్మి చెట్టు, దగ్గర దోభీ ఘాట్ల నిర్మాణం చేపట్టారన్నారు. అయితే నేటికీ కూడా ఏ ఒక్క దోబిగాట్ కూడా వృత్తికి అవసరమైనవిగా లేవన్నారు. సరైన వసతులలో నిర్మాణం లేక మద్యం సేవించడానికి అడ్డాలుగా దోభీఘాట్లు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి దోభీ ఘాట్లకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు.

# తాగునీటి కష్టాలను తీర్చాలి

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగర లో నీ మున్సిపల్ కార్పొరేషన్ 34 వార్డుల పరిధిలో మంచినీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నగర సహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 34వ వార్డులోని సీపీఐ కొట్టాల్లో నివసిస్తున్న సుమారు 70 కుటుంబాలు తాగడానికి నీరు లేక ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీ నాలి పని చేసుకునే పేదలు సిటీలో ఇంటి అద్దెలు చెల్లించలేక గుడిసె వేసుకొని జీవిస్తున్నారని, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో అధికారుల కు వినతి పత్రాలు అందజేసినా స్పందన లేదని, ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.




కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, అన్వర్ బాషా, నాయకులు రామాంజనేయులు, రబియా, ధనలక్ష్మి, అబ్రహం, రాముడు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వాలంటీర్స్ వ్యవస్థను కొనసాగించాలి



మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్స్ వ్యవస్థను కొనసాగించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించి రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల 60 వేల మంది న్యాయం జరిగే విధంగా అసెంబ్లీలో చర్చించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలంటీర్స్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం), ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర కార్యదర్శి బిసన్న, వాలంటీర్స్ అసోసియేషన్ నాయకులు కుమారు, మహబూబ్ బాషా, సుకన్యలు, మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు వాలంటీర్స్ ఆందోళన చెందుద్దని, మిమ్మల్ని కొనసాగిస్తామని హామీ ఇవ్వడమే కాకుండా పదివేల రూపాయల వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తున్నా వాలంటీర్ వ్యవస్థ గురించి పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 60 వేల కుటుంబాలు తీవ్ర గందరగోళంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వాలంటీర్ వ్యవస్థ గురించి అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి న్యాయం చేయాలని కోరారు. విధుల్లోకి తీసుకొని పెండింగ్ జీతాలు చెల్లించాలని, అలా కాని పక్షంలో నెలకు పదివేల జీతంతో ప్రత్యామ్నయ ఉద్యోగాలు చూపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అసెంబ్లీ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వాలంటీర్స్ రామాంజినేయులు, రాజశేఖర్, నూర్ బాషా,,రామాంజి, షాకీర్ బాషా, మినా కుమారి, రెస్మా, సైయాద్ బాషా, అల్తాబ్ బాషా, తార, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఎంపీ నాగరాజు

మనగళం, కర్నూలు సిటీ : తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు నగరంలోని రాక్ వుడ్ మెమోరియల్ పాఠశాలలో సోమవారం జరిగిన 1976-1986 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతంలో రాక్ వుడ్ పాఠశాలలో చదువుకోవడానికి సీట్ దొరకడం కూడా కష్టంగా ఉండేదని గుర్తు చేశారు. అలాంటి స్కూల్ నేడు అంతరించిపోవడం విచారకరమన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. అయితే అంతరించిపోయిన రాక్ వుడ్ పాఠశాలను తిరిగి స్కూల్ గా లేదా స్టడీ సర్కిల్ గా ఏర్పాటు చేసేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారని, వారికి తన పూర్తి సహాయ సహకారాలు అందించడంతో పాటు ఈ విషయాన్ని సీ.ఎం చంద్రబాబు తో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారు.



## పౌష్టికాహార మాసోత్సవాల పోస్టర్స్ విడుదల

మనగళం, కర్నూలు సిటీ : ప్రతి సంవత్సరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో ప్రారంభమయ్యే పౌష్టికాహార మాసోత్సవాల పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య విడుదల చేశారు. ఈ కార్యక్రమం విద్యా,ఆరోగ్య, అగ్రికల్చర్, పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్, ఫారెస్ట్ తదితర శాఖల జిల్లా అధికారుల ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం ఈ కార్యక్రమాల విజయవంతానికి పై శాఖల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు పోషణ్ మా వేడుకలు జిల్లాలోని 1886 అంగన్వాడీ కేంద్రాల్లో ఘనంగా జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 17న మధ్యప్రదేశ్ లోని దార్ లో ప్రధాన మంత్రి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలోని తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టులలో రకరకాల కార్యక్రమాల ద్వారా అన్ని లైన్ డిపార్ట్మెంట్స్ తో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీ ఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, ఐసిడిఎస్ పిడి విజయ తదితరులు పాల్గొన్నారు.



## బాధితులకు న్యాయం చేస్తాం

మనగళం, కర్నూలు క్రైం : కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడారు. విచారించి న్యాయం చేస్తామని బాధితులకు జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ రూ. రూ. 5 లక్షలు తీసుకున్నారు: నా భార్యకు ఎస్ బి ఐలో అసిస్టెంట్ మెనేజర్ ఉద్యోగం ఇప్పిసామని చెప్పి మాసుమాన్ దొడ్డి గ్రామానికి చెందిన ఉపేంద్ర రూ. 5 లక్షలు తీసుకొని మోసం చేశాడని ఎమ్మిగనూరు, మసీదు పురం గ్రామానికి చెందిన కొండయ్య ఎస్పీకి ఫిర్యాదు చేశారు. డిజిటల్ అరెస్టు పేరుతో తెలియని వ్యక్తులు ఫోన్ చేసి భయాందోళనకు గురి చేశారని కర్నూలుకు చెందిన ఓ వ్యక్తి జిల్లా ఎస్పీని ఆశ్రయించాడు. ఆస్తులను సీజ్ చేస్తామని నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేసి రూ. 8 లక్షల 40 వేలు తీసుకున్నారని రికవరీ చేసి న్యాయం చేయాలని కోరారు. నా కంది పంట ను ముగ్గురు వ్యక్తులు కలిసి ఉద్ధ్యేశపూర్వకంగా నాశనం చేసి నష్టం కలిగించారని, చట్ట ప్రకారం న్యాయం చేయాలని ఉలిందకొండ గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. జామీను(ష్యూరిటి)ఇచ్చి ట్రాక్టర్ ఇప్పించాను. ట్రాక్టర్ తీసుకున్న రామాంజనేయులు గౌడ్ నమ్మించి, మోసగించి ట్రాక్టర్ తో ఉడాయించి వెళ్ళిపోయాడు , పరారీలో ఉన్న అతని పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, సోమిశెట్టి నగర్ కు చెందిన సుదర్శన్ ఫిర్యాదు చేశారు. ఇల్లు బాడుగ కి ఇచ్చాము. కోర్టు ద్వారా ఉత్తర్వులు వచ్చినా కూడా ఖాళీ చేయకుండా ఇబ్బందులకు



గురి చేస్తున్నారని కర్నూలు, బుధవార పేట కు చెందిన మాదక్క ఫిర్యాదు చేశారు. మండల సర్వేయర్ , గ్రామ సర్వేయర్ , గ్రామ తలారి , వి.ఆర్.ఓ , కురువ తిప్పన్న కలిసి 3 ఎకరాల 70 సెంట్ల భూమి లో కొంత భాగాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని పత్తికొండకు చెందిన పెద్దహుల్తెన్న ఫిర్యాదు చేశారు. పొలం దగ్గర హద్దు రాళ్ళు తీసివేసి ముందుకు జరిపినారని, న్యాయం చేయాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆశ్రయించిన బాధితుల సమస్యలపై విచారించి న్యాయం చేస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐ లు పాల్గొన్నారు.

## శక్తి సదన్ ను పరిశీలించిన న్యాయమూర్తి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సోమవారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగనాన్ని (శక్తి సదన్) తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించిన న్యాయమూర్తి సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తే 15100 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేస్తే వెంటనే న్యాయ సహాయం అందిస్తామని తెలియజేశారు. ప్రాంగణంలో సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. అక్కడ ఉన్నవారు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ మరియు మహిళా ప్రాంగణం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ చదివాకే దినచర్య మొదలు

– ఎంపీ బస్తిపాటి నాగరాజు

మనగళం, కర్నూలు సిటీ : ప్రతి రోజు న్యూస్ పేపర్ చదివిన తరువాతనే తన దినచర్య మొదలవుతుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు నగరంలోని మౌర్య ఇన్ పరిణయ ఫంక్షన్ హాల్ లో సీ.ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు గ్రామీణ విలేకరులకు నిర్వహించిన పునశ్చరణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పునశ్చరణ తరగతుల్లో పాల్గొన్న విలేకరులకు పార్టిసిపేట్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఎంపీ నాగరాజు మాట్లాటుడుతూ ఉదయం లేవగానే న్యూస్ పేపర్లను చదువుతానని, వాటిలో వచ్చే ప్రజా సమస్యల పై ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తానన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారదులాంటి వారని, తమ వార్తల ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చెర వేయడంలో వారి కృషి వెలకట్టలేనిదన్నారు. నిజ నిజాలు తెలుసుకున్న తరవాతే వార్తలను ప్రచురించాలన్న ఆయన జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యాక్రమంలో సీ.ఆర్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఏఎస్పీ హుస్సేన్ పీరా , సమాచార శాఖ డీ.డీ జయమ్మ, ఐజేయూ జాతీయ సభ్యుడు నాగరాజు, రాష్ట్ర



అధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## అంగీకార్ - 2025 పథకం పోస్టర్ల ఆవిష్కరణ



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ "అంగీకార్ 2025 " పోస్టర్లను సోమవారం నగరపాలక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రధాన మంత్రి ఆవాస్ యోజన %-% అర్బన్ 2.0 (పీఎంఏవై-యూ 2.0) కింద కేంద్ర ప్రభుత్వం 'అంగీకార్ 2025' కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు మరింత పారదర్శకంగా, వేగవంతంగా గృహ నిర్మాణ సదుపాయాలు కల్పించడమే కాకుండా, సమాజంలోని బలహీన వర్గాలకు కూడా గృహ కలలను నెరవేర్చే దిశగా పథకంపై విస్తృత ప్రచారం చేయడం జరగుతుందన్నారు. బలహీన వర్గాలు, ప్రత్యేక దృష్టి గల వర్గాలకు పథకం యొక్క లబ్ధి చేరవేయడం, దరఖాస్తుల ఫాస్ట్ ట్రాక్ ధృవీకరణ చేయడం, లబ్ధిదారులకు త్వరిత గతిన బ్యాంకుల ద్వారా గృహ రుణాలను కల్పించడం జరుగుతందన్నారు. వడ్డీ సబ్సిడీ పథకం (ఐఎస్ఎస్) కింద గృహ రుణ సబ్సిడీలు అందించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిసిటిసి ఎస్‌డిఎస్ డాక్టర్ పెంచాలయ్య, సిఎంఎం భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఆర్ గడువు పొడిగింపు..? స్పష్టతనిచ్చిన ఐటీ విభాగం

మనగళం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదాయ పన్ను రిటర్న్లు (ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు నేటితో ముగియనున్న విషయం తెలిసిందే. అయితే, ఈ గడువు పొడిగించినట్లు వార్తలు వస్తున్నాయి. సెప్టెంబరు 30 వరకూ గడువు పొడిగించినట్లు తెగ ప్రచారం జరుగుతోంది . ఈ ప్రచారంపై ఐటీ విభాగం స్పష్టతనిచ్చింది. అవన్నీ ఫేక్ వార్తలని తేల్చి చెప్పింది. ఐటీ రిటర్నుల దాఖలుకు ఎలాంటి పొడిగింపు లేదని స్పష్టం చేసింది. ఫైలింగ్ గడువును ఇప్పటికే జులై 31 నుంచి సెప్టెంబరు 15 వరకు పొడిగించినట్లు గుర్తు చేసింది. దీన్ని సెప్టెంబరు 30వ తేదీ వరకు పొడిగించినట్లు వార్తలు వస్తున్నాయని.. ఆ వార్తల్లో నిజం లేదని స్పష్టం చేసింది. ఐటీ రిటర్న్ దాఖలుకు నేడే (సెప్టెంబరు 15) చివరి తేదీ అని వెల్లడించింది. సోషల్ మీడియాలో వస్తున్న అవాస్తవాలను నమ్మొద్దని సూచించింది. ఆదాయపు పన్ను విభాగం అధికారికంగా ఇచ్చే అప్‌డేట్లను మాత్రమే అనుసరించాలని తెలిపింది. ఐటీ రిటర్నులు దాఖలు చేసేవారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు హెల్ప్‌డెస్క్ 24 గంటలు పనిచేస్తున్నదని, ముఖ్యంగా కాల్స్, లైవ్ చాట్స్, ఎక్స్ ద్వారా సమాధానాలు ఇస్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు ఐటీ విభాగం తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ప్రకటన విడుదల చేసింది. మరోవైపు అసెస్‌మెంట్ ఇయర్ 2025-26కిగాను ఇప్పటి వరకు ఆరు కోట్లకు పైగా ఐటీ రిటర్నులు దాఖలు చేసినట్టు ఆదాయ పన్ను మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఐటీ రిటర్నులు దాఖలు చేసినవారందరికి కృతజ్ఞతలు..వీరి వల్లనే కీలక మైలురాయి 6 కోట్లను అధిగమించినట్టు తెలిపింది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

మనో వికాసానికి

బాల సాహిత్యమే పునాదిమానవ జీవితానికి బాల్యం ఆధారభూతమైన దశ. ఈదశలో పిల్లల మనస్సు ఆకర్షణకు లోనవుతుంది, ఊహలకు గొప్ప స్థావరంగా ఉంటుంది. అలాంటి దశలో వారు చదివే, వినే, చూసే, అనుభవించే అంశాలే భవిష్యత్తు కాలంలో వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. పిల్లలు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదగాలంటే ప్రేమ, ఆహారం, స్వచ్ఛమైన గాలి, ఆటలు ఎంత అవసరమో కళలు, కథలు, కవితలు, సంగీతం కూడా అంతే అవసరం. బాలసాహిత్యం అనేది పిల్లల కోసం రాసేది. అలా రాసిన బాల సాహిత్యం పిల్లల్లో తమదైన ఊహాశక్తి, జ్ఞానం, నైతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కథలు, కవితలు, నాటికలు, జానపద గాథలు, ఇతర రూపాల్లో లభించే బాల సాహిత్యం పిల్లల మానసిక, భావోద్వేగ, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుంది. నిజానికి బాల సాహిత్యం ఎదుగుతున్న పిల్లల జీవితాల్లో ఒక అమూల్యమైన సంపద. ఇది వారి మనసును ఆకర్షిస్తూ, విజ్ఞానాన్ని అందిస్తూ, నైతిక విలువలను నేర్పిస్తుంది. భవిష్యత్ సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి బాల సాహిత్యం ఎంతో ముఖ్యమైనది. పిల్లలను ఉత్తమ తరంగా, పౌర సమాజంగా సంసిద్ధం చేయడానికి బాల సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనం. దీన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా మనం పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించవచ్చు. బాల సాహిత్యం చదువడం వల్ల పిల్లల్లో ఊహాశక్తి రెక్కలు కట్టుకొని ఎగురుతుంది. మాయాజాల కథలు, సాహస గాథలు వారిలో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఇవి వారి సృజనాత్మక ఆలోచనలను పెంచి, సమస్యలను వినూత్నంగా పరిష్కరించే సామర్థ్యాన్ని అందిస్తాయి. బాల సాహిత్యం వివిధ రూపాల్లో ఉంటుంది. వాటిద్వారా వారిలో భాషా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. సరళమైన, ఆకర్షణీయమైన శైలిలో రాసిన కథలు, కవితలు వారి పఠన, రచన, శ్రవణ సామర్థ్యాలను మెరుగుపరుస్తాయి. బాలసాహిత్యం పిల్లలకు సత్యం, ధర్మం, సహానుభూతి, సహకారం వంటి నైతిక విలువలను కూడా నేర్పుతుందనే చెప్పవచ్చు. అలనాటి పంచతంత్రం, ఈసప్ కథలు వంటివి నీతి బోధనల ద్వారా పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయి. వేమన, సుమతి పద్యాలు వాళ్లలో సృజనాత్మకతకు పాదులు వేస్తాయి. అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలు చెప్పే కథలు, జానపద కథలు పాటల ద్వారా పిల్లలు తమ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకుంటారు. ఇది వారిలో సాంస్కృతిక గౌరవాన్ని, గుర్తింపును కలిగిస్తుంది. బాలలు కథలు, కవితలు, పాటలు చదువడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, ఓర్పు, పట్టుదల వంటి గుణాలు పెరుగుతాయి. బాల సాహిత్యం పిల్లల్లో సానుకూల వ్యక్తిత్వ లక్షణాలను రూపొందిస్తుంది. సమూహ కథలు, స్నేహగాథలు పిల్లలకు సహకారం, జట్టు కృషి, టీం స్పిరిట్ పక్కవారి భావాలను గౌరవించడం లాంటి అంశాలను నేర్పుతాయి. అంతేకాదు, సైన్స్ విజ్ఞాన సంబంధిత కథలు, కవితలు శాస్త్రీయ పిల్లల్లో జ్ఞానాభిరుచిని పెంచుతాయి. కథల ద్వారా పిల్లలు వివిధ భావోద్వేగాలను అర్థం చేసుకుంటారు. దుఃఖం, సంతోషం, భయం వంటి భావాలను నియంత్రించడం నేర్చుకుంటారు. బాల సాహిత్యం పిల్లలకు వినోదాన్ని అందిస్తూనే ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది వారి మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది. ఇట్లా బాలల గురించి బాలల సాహిత్యం సినిమాలు సాంస్కృతిక రంగం గురించి చాలా మాట్లాడతాం. కానీ, మన దేశంలో పిల్లల కోసం చేస్తున్నదేమిటి? ఎంత? అని ఆలోచిస్తే జరుగుతున్నది చాలా స్వల్పమనే చెప్పాలి. ముఖ్యంగా పిల్లల సృజనాత్మక రంగంలో జరుగుతున్న కృషి చాలా తక్కువ. మలయాళం, బెంగాలీ, కన్నడ, కొంత మరాఠీ భాషల్లో మాత్రం ఎన్నదగిన కృషి జరుగుతున్నది. తెలుగులో బాల సాహిత్యం విరివిగానే వస్తున్నప్పటికీ ఇంకా నాణ్యమైన రచనలు రావాల్సి ఉన్నది. మరోవైపు బాల సాహిత్యకారులను ద్వితీయస్థాయి సృజనకారులుగా కాకుండా వారికి ఇవ్వాల్సిన గుర్తింపు ఇవ్వాల్సి ఉన్నది. సాహిత్య విషయాలు ఇట్లా ఉంటే సిన్మా సంగతి మరింత దారుణం. పిల్లల కోసం ప్రత్యేకంగా తీసిన వందల బాలల సినిమాలు ముంబై చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ గోదాముల్లో స్తబ్ధంగా పడి ఉన్నాయి. ఇక మన హైదరాబాద్‌లో జరగాల్సిన అంతర్జాతీయ స్థాయి పిల్లల సినిమాల పండుగకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తిలోదకాలిచ్చేశాయి.

ఈ స్థితిలో బాల సాహిత్యకారులు మరో అంశాన్ని గమనించాల్సి ఉన్నది. ఇవ్వాళ ప్రాథమికోన్నత విద్యాసంస్థలన్నీ ఇంగ్లీష్ మాధ్యమానికే మొగ్గు చూపుతున్నాయి. భవిష్యత్తులో ఉద్యోగాల కోసమైనా, మరి దేనికోసమైనా ఇంగ్లీష్ తప్పనిసరి అనే వాదంతో తెలుగు బోధన అపురూపమైపోయిందనే చెప్పాలి. ఇక ఐటీ తదితర రంగాల్లో ఉన్నవాళ్లకు తెలుగు చదువడమే గగనమైపోయింది. అందుకే బాలసాహిత్య సృజనకర్తలు కేవలం తెలుగులోనే రాసి ఊరుకోకుండా వాటికి ఆంగ్లానువాదాలను కూడా జతచేసి ప్రచురించగలిగితే ఈ రోజుల్లోని ఇంగ్లిష్ మీడియం స్కూళ్లల్లో వాటికి సముచితమైన స్థానం లభిస్తుంది. టీవీల్లో, ఇంటర్నెట్‌లో ఇంగ్లిషుకే అలవాటు పడిపోతున్న బాలలకు ద్విభాషా పుస్తకాలు ఎంతో మేలు చేస్తాయి. ఈ దిశలో పెద్దపల్లి లాంటి ఒక మారుమూల ప్రాంతంలో జరిగిన ఒక ప్రయత్నాన్ని అందరి దృష్టికి తేవాలని ఉన్నది. పుల్లూరి జగదీశ్వర్‌రావు అనే బాల సాహిత్యవేత్త 'లిటిల్స్' అనే ఒక కథల పుస్తకాన్ని తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రాసి ప్రచురించారు.

ఆయన ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో తహశీల్దార్‌గా పనిచేస్తున్నారు. విద్యాధికుడైన ఆయన పలు పత్రికల్లో కూడా వ్యాసాలు రాస్తారు. 'ఎడారి మొక్కలు' కథతో మొదలయ్యే ఈ కథా సంకలనంలో 24 కథలున్నాయి. అలతి అలతి మాటల్లో జీవకారుణ్యం, పర్యావరణం, జీవ వైవిధ్యం, కాలుష్యం వంటి అనేక అంశాలను కథలుగా ద్విభాషల్లో గుదిగుచ్చారు. ఈ కథలను చదివి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ఆకర్షితుడై 150 పేజీల 'లిటిల్స్' పుస్తకాన్ని తానే ముద్రించి పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేయించారు. కలెక్టర్ శ్రీహర్ష రాసిన ముందుమాటలో 'పాఠశాల విద్యను అభ్యసిస్తున్న కాలం బాలబాలికలకు అత్యంత ముఖ్యమైన కాలం. వాళ్లు వ్యక్తులుగా రూపొందే క్రమం అక్కడే మొదలవుతుంది' అన్నారు. అది ముమ్మాటికీ నిజం. పుల్లూరి జగదీశ్వర్‌రావు వలె పిల్లల కోసం ద్విభాషా కథలు, కవితలు రాయడం, కలెక్టర్ శ్రీహర్ష లాగా ప్రోత్సహించి స్కూలు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్రమంతటా, అన్ని జిల్లాల్లోనూ జరగాల్సి ఉన్నది. అట్లయితేనే అర్థవంతమైన బాల సాహిత్యం అందుబాటులోకి వస్తుంది.

## పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



మన గళండోన్ పట్టణంలోని పశువులకు నాలుగు నెలలు పైబడిన దూడలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ %=%. నాగరాజు సహాయ సంచాలకులు డోన్ మరియు %బాబా% మహమ్మద్ రఫీ, నవ్య %నానా% మరియు సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ . నాగరాజు మాట్లాడుతూ 15.09.2025 నుంచి 15.10. 2025వ తేదీ వరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం క్రింద పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేసి ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు, కాబట్టి రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గాలికుంటు వ్యాధిలక్షణాలు:

1. తీవ్రమైన జ్వరం మరియు నీరసము
2. నోటి నుండి తీగల మాదిరిగా చొంగ కారడం.
3. నోరు మరియు గిట్టల మధ్య పుండ్లు ఏర్పడుట.
4. కొద్దిపాటి ఎండకు కూడా రుప్పడం
5. చూడి పశువులు ఇసుకపోవడం,
6. పాల ఉత్పత్తి మరియు పని సామర్థ్యం గమనియంగా తగ్గిపోవుట, రైతులకు ఆర్థిక నష్టము.
7. పాలు త్రాగే దూడలలో మరణాలు సంభవించుట,
8. వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోవడం జరుగుతుంది

పశువులో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల వలన లాభాలు:

1 . వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తి శాశ్వతంగా నివారించవచ్చు.
2. వ్యాధి సోకిన మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యాన్ని పూర్తిగా అరికట్టవచ్చు.
3. దూడల్లో మరణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడుతుంది.

గమనిక: నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలి గాలికుంటు టీకా చేపిద్దాం పశువుల ఆరోగ్యాన్ని కాపాడు కోవాలి.

## రాయలసీమ దైవ సేవకుల సదస్సు:





మన గళం డోన్ : నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 20వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు రాయలసీమ దైవ సేవకుల సదస్సు జరగనుంది. ఈ సదస్సు సంబంధిత వాల్‌పోస్టర్లను బైబిల్ మిషన్ ఏవో రెవరెండ్ బందెల రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాయలసీమ జిల్లాల నుండి తరలివచ్చే దైవ సేవకులను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్రం, దేశం, ప్రపంచ దేశాల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నామని వివరించారు. వాల్ పోస్టర్లు విడుదల కార్యక్రమంలో సాల్మన్, దేవదాస్, రాజ్ కుమార్, మాణిక్యం రెడ్డి, బర్నబాస్, టీచర్ రాజు, సామెల్, ఎబినేజర్, డేవిడ్, దేవ సహాయం, ఆదం, ఇస్సాకు, ప్రవీణ్ కుమార్ మరియు స్థానిక చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.






## రాష్ట్ర ఎఐటియుసి పిలుపుమేరకు ఆటో కార్మికుల సమస్యలపై పరిష్కరించాలని నిరసన




మన గళండోన్ స్థానిక పాత బస్టాండ్ నందు డోన్ నియోజకవర్గ ఏఐటియుసి ఆటో యూనియన్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన జరిగినది ఈ కార్యక్రమానికి జిల్లా ఏ ఐ టి యు సి కార్యదర్శి సుంకయ్య గారు జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అన్వర్ గారు ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికుల సమస్యల పరిష్కరించాలని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులకు ఆదాయం లేక ఆటో కార్మికుల కుటుంబానికి పోషించడం చాలా ఇబ్బందిగా గురవుతున్నారని తక్షణమే కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు జీవన ఉపాధి కింద నెలకు 5000 రూపాయలు చొప్పున సంవత్సరానికి 60 వేల రూపాయలు ఇవ్వాలని ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కాంపౌండ్ ఫీజులు పెంచే జీవో నెంబర్ 21 31 రద్దు చేయాలని ప్రవేట్ సంస్థలకు ఇచ్చిన ఫిట్నెస్ డ్రైవింగ్ లైసెన్స్ లో అనుమతులు రద్దుచేసి ప్రభుత్వ ఆధ్వర్యంలో లైసెన్సులు ఫిట్నెస్ చేయాలని పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించాలని థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రోడ్ టాక్స్ లేబర్ టాక్స్ ఫీజులు తగ్గించాలని వాహన విడిభాగాలు ధరలను 30% తగ్గించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగినది కనుక ఆటో డ్రైవర్ల న్యాయమైన కోరికలను పరిష్కరించాలని లేనిచో రాబోయే రోజుల్లో నిరసన కార్యక్రమాన్ని తీవ్రత ఉధృతం చేస్తామని వారు కొనియాడారు ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కాసిం నారాయణ మధు సెక్ష బద్రి రాముడు కంబగిరి తదితర ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగినది

## ప్యాపిలి మండలం నెరేడుచర్ల గ్రామములోని ఏం పి పి స్కూల్లో పని చేస్తున్న ప్రధాన ఉపాధ్యాయులు అయిన సాంబశివుడు పై చర్యలు తీసుకోవాలి



మన గళం ప్యాపిలి : విధ్యార్థి సంఘాలపైన తప్పుడు ఆరోపణలు చేస్తూన్న ప్యాపిలి మండలం, నెరేడుచర్ల గ్రామములోని ఏం పి పి స్కూల్లో పని చేస్తున్న ప్రధాన ఉపాధ్యాయులు సాంబశివుడు పై చర్యలు తిసుకోవాలి అని జిల్లా ఉప విద్యా అధికారులు గారికి వినతిపత్రాన్ని అందజేసిన. ఎసి,ఎస్టీ,బీసీ,మైనారిటీ విద్యార్థి ఐక్యవేదిక ఎసి,ఎస్టీ,బీసీ,మైనారిటీ విద్యార్థి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఇమిడి లక్ష్మణ్ సాయి మాట్లాడుతూ టీచర్స్ డే సంధర్భంగా ప్యాపిలిలో జరిగినటువంటి ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమములో సాంబశివుడు ప్రధాన ఉపాధ్యాయులు ప్రసంగిస్తూ విద్యార్థి సంఘాలపై ఆరోపణలు చేశారు. ఆరోపణలు ఏమనగా స్కూళ్లలోకి సంఘాల వారు వచ్చి బ్లాక్ మెయిల్ చేస్తూ మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని తప్పుగా ఒక కార్యక్రమములో అన్ని సంఘాలపై ఆరోపించి మా ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడం జరిగింది. విద్యార్థుల భోజనం విషయంలో మరియు వివిధ విషయాలపైన విధ్యార్థి సంఘాల వారు జోక్యం చేసుకుంటున్నారు అని అన్ని విద్యార్థి సంఘాలపై తప్పుడు ఆరోపణలు చేసారు. ఆ విధంగా ఏ విధ్యార్థి సంఘాల వారు చేస్తున్నారో వారిపై ఆరోపణలు చేయాలి గాని ఇలా అన్ని సంఘాల వారిని నిందించడం సరికాదు అని ఎసి,ఎస్టీ,బీసీ,మైనారిటీ విద్యార్థి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఇమిడి లక్ష్మణ్ సాయి అన్నారు

- ఒకరు ఏదో మాట్లాడినరు అని అన్ని సంఘాలను అనడం సరికాదు.
- మరి మీ టీచర్లు సంఘాలు ఏమీ అన్న సరిగ్గా ఉన్నాయా అని మిము అంటే ఎలా ఉంటుంది.
- మరి టీచర్లు విద్యార్థిని లతో అసభ్యంగా మాట్లాడటం,అత్యాచారలు జరుగుతున్నాయి మరి మిము కూడా మీ టీచర్లు ఇంతేనా అంటే మీకు ఎలా ఉంటుంది.
- టీచర్లు సంఘాలు కూడా సరిగా విధులకు హాజరు కాకుండా విద్యార్థులకు సరిగా పాఠాలు చెప్పడం లేదు అంటే మీకు ఎంత రోషాలు వస్తాయో.
- మరి ఒక టీచర్ తప్పుగా చేస్తే అందరి టీచర్లు ను అంటే మీకు ఎలా ఉంటుందో చెప్పండి. కావున సంఘాలు గా మిము ఎవరు తప్పు చేస్తే వారి గురించే మాట్లాడుతం అని ప్రధాన ఉపాధ్యాయులు మరియు ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ నాయకులు సాంబశివుడు ను ప్రశ్నించారు. సాంబశివుడు పై తక్షణమే చర్యలు చెపేటెంత వరకు ఎసి,ఎస్టీ,బీసీ,మైనారిటీ విద్యార్థి ఐక్యవేదిక వదిలే ప్రశక్తి లేదని తెలిపారు. ఈ విషయం పై ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రెటరీ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్,నంద్యాల జిల్లా కలెక్టర్,నంద్యాల జిల్లా విద్య అధికారులు దృష్ఠికి తీసుకెళు_న్నం అని విద్యార్థి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఇమిడి ఇమిడి లక్ష్మణ్ సాయి తెలిపారు. కావున విద్య శాఖ అధికారుల వారు మా ఈ విన్నపాన్ని స్వీకరించి మాపై అనగా అన్ని సంఘాల వారిపై తప్పుడు ఆరోపణలు చేసిన సాంబశివుడు అనే ప్రధాన ఉపాధ్యాయులు గారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సి, ఎస్టీ, బి.సి. మైనార్టి విధ్యార్థి ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తూ మిమ్మల్ని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరడమైనది. లేని పక్షాన ఈ విషయంపై పోరాటం ఉదృతం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పవన్, వెంకటేష్, కిరణ్, వంశీ, మనోజ్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోతున్న ఉల్లి రైతులను క్వింటానికి 2500 రూపాయలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి గౌస్ దేశాయ్ డిమాండ్

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలో సిపిఎం పార్టీ బృందం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కే రాజు సిపిఎం పార్టీ మండల నాయకులు గఫూర్ మియ బృందం కలిసి వల్కూరు గ్రామంలోని పంట పొలాల్లో ఉన్న ఉల్లి పంటలను పరిశీలించడం జరిగింది శివ అనే రైతు పొలానికి వెళ్లి పరిశీలించగా రెండు ఎకరాల పొలంలో దాదాపు ఒక లక్ష 80 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి బాధపడుతున్నారు ఇప్పటికే 15 రోజుల కిందట ఉల్లి పంటను పీకించారు ఆ ఉల్లిని కోత కోసి గ్రేడింగ్ చేయాలంటే దాదాపుగా 40 వేలు ఖర్చు వస్తుందంటున్నారు అలా చేసిన గిట్టుబాటు ధర లేక పెరికిన ఉల్లిగడ్డను అలాగే పొలంలో వదిలిపెట్టారు రైతు శివను అడిగి తెలుసుకుంటే కనీసం ప్రభుత్వం నుండి ఒక 2000 రూపాయలైనా ధర కల్పిస్తే కనీసం పెట్టుబడి అయినా కొంతమేర వస్తుందని అంటున్నాడు ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే పెట్టిన పెట్టుబడులు రాక అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్గొనే పరిస్థితులు ఉన్నాయి జిల్లా కార్యదర్శి గౌస్ దేశ మాట్లాడుతూ ప్రభుత్వం మార్కెట్లో కొనుగోలు చేసే దానికన్నా రైతుల దగ్గరికి వచ్చి పొలాల్లోనే మార్క్ఫెడ్ వారి ద్వారా కొనుగోలు చేస్తే కనీసం వారికి రవాణా ఖర్చు అయిన మిగులుతుంది రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి ఉల్లిని నిలువ ఉంచుకోవడానికి గోదాములు నిర్మిస్తే తర్వాత అయినా అమ్ముకోవడానికి వీలుంటుంది పండించిన పంటను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తే రైతులకు ఇన్ని కష్టాలు ఉండవు ఉల్లిపంట కూడా పాడవదు కర్నూలు జిల్లాలో పెద్ద ఎత్తున ఉల్లి పంటను పండిస్తారు గత సంవత్సరం కొంతమేర ధరలు బాగున్నా పంటలు తగ్గిన రైతులు నిలదొక్కున్నారు ఈ సంవత్సరం కూడా మంచి ధరలు వస్తాయని రైతులు ఎంతో ఆశతో వందల ఎకరాల్లో ఉల్లి పంటలు సాగు చేశారు తీరా అకాల వర్షాలు వల్ల ఉల్లి పంట పొలాల్లోనే కుళ్ళిపోతుంది ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం పై ఉన్నది మహారాష్ట్ర నుంచి వస్తున్న ఉల్లి నీ దిగుమతి చేసుకోకుండా జిల్లాలో పండిస్తున్నటువంటి ఉల్లి పంటను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తే రైతులకు ఊరట కలుగుతుంది ప్రస్తుతం ప్రభుత్వం 1200 రూపాయలు ప్రకటించింది అది ఏమాత్రం చాలదు కనీసం 2500 అయినా ధర ప్రకటిస్తే పెట్టిన పెట్టుబడి అయినా రైతుకు అందుతుంది పరిశీలనలో భాగంగా ఒక మహిళ రైతును విచారించగా ఉల్లి పంట పెరగడానికి 10000 ఖర్చు వచ్చింది గిట్టుబాటు ధర లేక ఉల్లి అమ్ముకోలేక కనీసం బయట రోడ్డు పైన పారబోస్తామనుకుంటే అందుకు కూలీలకు 20000 రూపాయలు ఖర్చవుతుంది అలాగే వదిలేస్తే పొలం చెడిపోయి గడ్డి పెరుగుతుంది ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వమే తమరిని ఆదుకోవాలని మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేసింది రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులను తక్షణమే ఆదుకోవాలని వారి డిమాండ్ చేశారు





# ఈనెల 26న మంత్రాలయం పీఠాధిపతి కోడుమూరు ధర్మపురి క్షేత్ర సందర్శన

మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న ధర్మపురి ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయానికి ఈనెల 26న (సెప్టెంబర్) మంత్రాలయం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదులు స్వామిజీ రానున్నారు. సోమవారం ధర్మపురి ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు నలుబోలు విజయ భాస్కర్ రెడ్డి, జీతూరి రవికుమార్, అద్దుగల నాగేశ్వరరెడ్డి, మాదుగుండు రాఘవేంద్ర, బండా నాగరాజు, కోట్రా అశోక్ కుమార్ శెట్టి చేతుల మీదుగా ఆ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేది సాయంత్రం 4 గంటలకు కోడుమూరుకు మంత్రాలయం పీఠాధిపతి శ్రీసుబుధేంద్ర తీర్థ శ్రీపాదులు స్వామిజీ వారు విచ్చేస్తారని, కోడుమూరు కొత్త బస్టాండ్ అంపయ్య సర్కిల్ నుంచి ధర్మపురి ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం వరకు రథంపై ఊరేగింపుతో ఆలయానికి చేరుకుంటారు ఆలయంలో పీఠాధిపతి చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం, అనంతరం అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని, స్వామిజీ చేతుల మీదుగా భక్తులకు తీర్థప్రసాదాలు, ఆశ్వీర్వచనము అందించనున్నట్లు తెలిపారు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వామిజీ గారిచే హిందూ ధార్మిక



ప్రవచనాలు, భక్తులందరికీ ఆధ్యాత్మిక సందేశం ఉంటుందని, అలాగే భక్తులకు అల్పాహార ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. కోడుమూరు మండలంతో పాటు చట్టు పక్కల గ్రామాల్లోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు

# తిరుపతి ఎంపీకి రెండవ ర్యాంక్

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : లోక్ సభలో ఆంధ్రప్రదేశ్ ఎంపీల పనితీరు నివేదికను పార్లమెంట్ ప్రతినిధులు విడుదల చేశారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి రెండో స్థానంలో నిలిచారు. ఆయన లోక్ సభ లో మొత్తం 70 ప్రశ్నలు అడగటంతో పాటు 19 చర్చల్లో పాల్గొన్నారు. ఆయన హాజరు శాతం 91.18గా ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకును కేటాయించినట్లు పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి.



# టీడీపీ నేత పలుచాని మృతి



మనగళం, పగిడ్యాల : నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం తూర్పు ప్రాతకోటకు చెందిన టీడీపీ నేత పలుచాని రాజశేఖర్ రెడ్డి (72) ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సోమవారం తూర్పు ప్రాతకోటకు వెళ్లి ముఖ్య అనుచరుడిగా ఉన్న పలుచాని రాజశేఖర్ రెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి భార్య కళావతమ్మ, కూతుళ్లు స్వర్ణలత, శ్రీలక్ష్మిలను బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఓదార్చి సానుభూతి తెలిపారు. పలుచాని రాజశేఖరరెడ్డి మృతి టీడీపీకి, తనకు తీరనిలోటని, ఆయన కుటుంబానికి తన సహకారం ఎల్లపుడు ఉంటుందని బైరెడ్డి భరోసా ఇచ్చారు.

# సున్నిపెంట లో సి.యన్ హాస్పిటల్ మరియు సుమన్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం








మనగలం: సున్నిపెంట గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నందు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది . కర్నూల్ సి య న్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్. తిలక్ మహేష్ మరియు గైనకాలజిస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆ ర్. శ్రావ్య దాదాపు 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి టాబ్లెట్లు అందజేశారు అనంతరం వారి ఇద్దరికీ స్థానికులు మరియు సుమన్ టీవీ ప్రతినిధులు నాయకులు సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుమన్ టీవీ ఇంచార్జ్ కిరణ్, సుమన్ టీవీ రిపోర్టర్ చందు , ఎస్కెబి సన్స్ ఖలీల్, టిడిపి నాయకులు, సుబ్బారెడ్డి, బిజెపి నాయకులు చదువుల శీను , సోమిశెట్టి మల్లికార్జున, రామకృష్ణ, రఫీ, గవర్నమెంట్ డాక్టర్ వినయ్ కుమార్, కాలేజ్ వాలంటీర్లు, లోకల్ వాళ్లంటీర్లు, మరియు స్థానికులు ఉస్మాన్, సులేమాన్, భూషణం, ప్రతాప్, అజయ్, విజయ్, శివ బోయ, నాగబాబు, మల్లీ మామ, సిరాజ్, రాకేష్ రెడ్డి, ఉదయ్ కుమార్, పాల్గొన్నారు

# ఆటో బోల్తా మహిళకు తీవ్రగాయాలు

జూరు గళ్కండోన్ జుండల పరిద్ధోని తిజుమ్మపురాం వ్గాజుం ణమీపర్ధో నడు ఖళజుూరాం ఉదజీం ఘోూ రోడ్డు వ్పజుూదం జరిగింది. వ్పజీూణ్బకులతో వ్ళ్కుతూ్ను ఆటో చీదుపుతప్పి ఖోఖి పడింది. ఈ వ్పజుూదర్లో ఆట్లో వ్పజీూణ్బణుఖ్ను తిజుమ్కక్క చీన జుహిళ్కకు వ్జు గాజీూలు చీజ్యాయి. ఖ్ఞానికులు డోన్ ఏరిజీూ ఆణుప్వతిక్చ తూలించాూ. జుహిళ్క పరిణ్ణితి విఔజుంగా ఉండడంతో కూర్నూ వ్పఖీుత్వ ఆణుప్వతిక్చ హెఫ్ఘే చణిుట్లు డాక్టూర్లు త్పలిదీూ.




# మెరుగైన వైద్యం అందించండి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- వైద్యులను హెచ్చరించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య





మనగళం, నందికొట్టూరు : రోగులకు మెరుగైన వైద్యం అందించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అధికారులకు సూచించారు. వైద్య సేవలు అందజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నందికొట్టూరు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సోమవారం ఎమ్మెల్యే తనిఖీ చేశారు. కొందరు డాక్టర్లు లేకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులపట్ల ఎందుకీ నిర్లక్ష్యం అంటూ మండిపడ్డారు. ఆసుత్రిని కలియతిరగారు. రోగులతో మాట్టాడిన ఎమ్మెల్యే వైద్య సేవలు ఎలా అందుతున్నాయి... వైద్యులు సక్రమంగా సేవలు అందజేస్తున్నారా... లేదా అని ఆరా తీశారు. అనంతరం సమస్యలపై వైద్యలతో ఎమ్మెల్యే చర్చించారు. పేసెంట్లపై సానుకూలంగా ఉండాలని, వారి సమస్యను తెలుసుకుని వైద్య సేవలు అందజేయాలని డాక్టర్లు, సిబ్బందికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా ఆసుపత్రి పరసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు..

మనగలం: బంగారం, వెండి ప్రియులకు గుడ్ న్యూస్ వచ్చింది. ఎందుకంటే వీటి ధరలు నిన్నటితో పోల్చుకుంటే స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, సెప్టెంబర్ 15, 2025 ఉదయం 6 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,11,160కి చేరింది . 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ. 1,01,890కి చేరుకుంది. ఇది నిన్నటి ధరలతో పోల్చితే స్వల్పంగా రూ. 10 మాత్రమే తగ్గింది. ఇదే సమయంలో ఢిల్లీలో కేజీ వెండి ధర రూ. 100 తగ్గి, రూ. 132,900కి చేరింది. ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు గ్లోబల్ మార్కెట్‌లో మార్పులతో భారతదేశంలో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. నగరాల వారీగా ధరలు చూస్తే, స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. మేకింగ్ ఛార్జీలు, స్థానిక పన్నుల ఆధారంగా ధరలు మారుతాయి. ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ గోల్డ్ ధర రూ. 1,11,290, 22 క్యారెట్ రూ. 1,02,040. కేజీ వెండి ధర రూ. 1,32,900

హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ. 1,11,160, 22 క్యారెట్ రూ. 1,01,890. కిలో వెండి రేటు రూ. 1,42,900

ముంబైలో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ. 1,11,160, 22 క్యారెట్ రూ. 1,01,890. కిలో వెండి రేటు రూ. 1,32,900

చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ. 1,11,170, 22 క్యారెట్ రూ. 1,02,190. కిలో వెండి రేటు రూ. 1,42,900

బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ. 1,11,160, 22 క్యారెట్ రూ. 1,01,890. కిలో వెండి రేటు రూ. 1,32,900, కోల్‌కతాలో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ. 1,11,160, 22 క్యారెట్ రూ. 1,01,890. కిలో వెండి రేటు రూ. 1,32,900

# కార్తీక మాసోత్సవాల సన్నాహక సమావేశం

- అక్టోబరు 22 నుంచి నవంబరు 21 వరకు కార్తీకమాసోత్సవాలు
- భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు

మనగళం శ్రీశైలం : పాతాళగంగవద్ద పుణ్యస్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు అక్టోబరు 24 కార్తీక మొదటి శుక్రవారం రోజున పాతాళగంగ వద్ద కృష్ణమ్మ హారతి నవంబరు 1 కార్తీక శుద్ధ ఏకాదశి రోజున గంగాధర మండపం వద్ద కోటి దీపోత్సవం కార్తీకమాసంలోని సోమవారాలలో లక్షదీపోత్సవం- పుష్కరిణి హారతి కార్తీకమాసమంతా గర్భాలయ అభిషేకాలు నిలుపుదల కార్తీక పౌర్ణమి రోజున జ్వాలాతోరణం, లక్షదీపోత్సవం- పుష్కరిణి హారతి, అక్టోబరు 22 నుంచి నవంబరు 21 వతేదీ వరకు కార్తీకమాసోత్సవాలు నిర్వహింపబడనున్నాయి. ఈ కార్తీకమాసోత్సవాల ఏర్పాట్లకు సంబంధించి ఈ రోజు (15.09.2025) పరిపాలనాభవనంలోని సమావేశమందిరంలో సన్నాహక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్. రమణమ్మ, ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, అధ్యాపక, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ సమావేశంలో భక్తులకు వసతి, మంచినీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, ఆలయ వేళలు, శ్రీస్వామిఅమ్మవార్ల ఆర్జితసేవలు, క్యూలైన్ల నిర్వహణ, రద్దీక్రమబద్ధీకరణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, కార్తీకసోమవారాలు, మొదటి శుక్రవారం రోజున కృష్ణమ్మకు హారతి, శుద్ధ ఏకాదశిరోజున కోటి దీపోత్సవం, లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి, కార్తీకపౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం మరియు పుణ్యనదీహారతి ఏర్పాట్లు, కార్తీకమాసంలో ఆకాశదీపం ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ మొదలైన అంశాలను గురించి సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. సమావేశంలో ముందుగా కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్తీక మాసంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్ని విభాగాలను ఆదేశించారు. ఆయా ఏర్పాట్లన్నీ కూడా ముందస్తుగా పూర్తి కావాలని అన్నారు. అక్టోబరు 15వతేదీకంతా అన్ని ఏర్పాట్లన్నీ కూడా పూర్తి చేయాలని అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కార్తీకసోమవారాలు, కార్తీకపౌర్ణమి, శుద్ధ ఏకాదశి మరియు ప్రభుత్వ సెలవురోజులలో భక్తులరద్దీ అధికంగా ఉంటుందని చెబుతూ రద్దీకనుగుణంగా ఆయా ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ పాతాళగంగవద్ద శౌచాలయాలకు, స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులకు మరియు పాతాళగంగ మెట్లమార్గం మొదలైన చోట్ల అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టాలన్నారు. అదేవిధంగా గంగాభవానీ స్నానఘట్టాలకు కూడా అవసరమైన మరమ్మతులను చేయించాలన్నారు. సమావేశంలో ఈ క్రింది అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.

సిబ్బందికి ప్రత్యేక విధులు : భక్తులకు సేవలు అందించేందుకుగాను కార్తీకమాసంలో రద్దీరోజులందు కార్యాలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడతాయి.

దర్శనం ఏర్పాట్లు: వేకువజామున గం.3,00లకు ఆలయద్వారాలు తెరచి, ప్రాతఃకాల పూజల అనంతరం వేకువజామున గం. 4,30ల నుంచి సాయంకాలం గం.4.00ల వరకు దర్శనాలు కల్పించబడుతాయి. అదేవిధంగా తిరిగి సాయంత్రం గం. 5.30ల నుంచి రాత్రి గం. 10.30ల వరకు దర్శనాలు కొనసాగుతాయి.

ఆర్జితసేవలు : కార్తీకమాసమంతా కూడా శ్రీస్వామివారి గర్భాలయ అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేయడం జరుగుతుంది. సామన్య భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీలుగా కార్తీకమాస శని, ఆది, సోమవారాలు, పౌర్ణమి మొదలైన పర్వదినాలలో (మొత్తం 15 రోజులలో) సామూహిక అభిషేకాలు కూడా పూర్తిగా నిలుపుదల చేయబడుతాయి. తక్కిన సాధారణ రోజులలో సామూహిక అభిషేకాలు పరిమితంగా నిర్వహించబడుతాయి.

అన్నప్రసాదాల వితరణ : భక్తులకు అన్న ప్రసాదవితరణ భవనములో ఉదయం గం.10.45ల నుండి అన్నప్రసాదాల వితరణ చేయబడుతుంది. సాయంత్రం గం. 7.00ల నుంచి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయబడుతుంది. క్యూకాంప్లెక్స్ దర్శనానికి వేచి ఉండే భక్తులకు మంచి నీరు, బిస్కెట్లు, అల్పాహారం అందజేయబడుతాయి. అదేవిధంగా రద్దీ అధికంగా ఉన్న రోజులలో ఉదయం వేళలో వేడిపాలు అందజేయబడుతాయి.

అడ్డు ప్రసాదాలు: కార్తీకమాసంలో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంఖ్యలో లడ్డు ప్రసాదాలు సిద్ధం చేయబడుతాయి. కార్తీకమాసమంతా కూడా అదనపు ప్రసాద విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేయబడుతాయి. అదనంగా 3. కౌంటర్లను ఏర్పాటు చేసి మొత్తం 10 కౌంటర్ల ద్వారా ప్రసాదాలు అందజేయబడుతాయి. పాతాళగంగవద్ద ఏర్పాట్లు కార్తీకమాసములో భక్తులు పుణ్యస్నానాలకు ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా పాతాళగంగ వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయబడుతాయి. పాతాళగంగవద్ద శౌచాలయాల నిర్వహణ, పారిశుద్ధ్యం నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుంది. అదేవిధంగా అదనపు లైటింగ్ ఏర్పాట్లు చేయబడుతాయి. భద్రతాచర్యలలో భాగంగా పాతాళగంగ వద్ద ఈతనిపుణులను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది. కేశఖండనశాలలో ఏర్పాట్లు భక్తులు తలనీలాలు సమర్పించుకునేందుకు కేశఖండనశాలలో ఆయా ఏర్పాట్లు చేయబడుతాయి. ముఖ్యంగా భక్తులరద్దీకనుగుణంగా కేశఖండనశాల వేళలను నిర్ధారించడం జరుగుతుంది.

సూచిక బోర్డుల ఏర్పాట్లు: భక్తులు సమాచారం తెలుసుకునేందుకు వీలుగా అవసరమైన అన్ని ప్రదేశాలలో తగినన్నీ సూచికబోర్డులు ఏర్పాటు చేయబడుతాయి. కార్తీకమాసం సందర్భంగా శివచతుస్సప్తాహ భజనలు. లోకకల్యాణం కొరకు కార్తికమాసంలో అఖండ శివభజనలు నిర్వహించబడుతాయి. కార్తీకదీపారాధనజి భక్తులు కార్తీకదీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తర మాడవీధీ ప్రత్యేక ఏర్పాట్లు చేయబడుతాయి. అదేవిధంగా ఆలయముందుభాగంలోని గంగాధరమండపం వద్ద కూడా దీపారాధనకు ఏర్పాట్లు చేయబడుతాయి.

కృష్ణమ్మ హారతి నవంబరు 24, కార్తీక మొదటి శుక్రవారం రోజున పాతాళగంగ వద్ద కృష్ణమ్మహారతి కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమములో





నదీమతల్లికి విశేషపూజాదికాలు, సారె సమర్పణ జరిపించబడుతాయి.

కోటి దీపోత్సవం: నవంబరు 1, కార్తీక శుద్ధ ఏకాదశిరోజున గంగాధర మండపం వద్ద కోటి దీపోత్సవం నిర్వహించబడుతుంది... ఈ దీపోత్సవానికి గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడుతాయి. పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం మరియు పుష్కరిణి హారతి కార్తీకసోమవారాలు మరియు పౌర్ణమిరోజున ఎప్పటి వలనే ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం మరియు పుష్కరిణి హారతి కార్యక్రమాలు నిర్వహించబడుతాయి. అదేవిధంగా గంగాధరమండపం వద్ద జ్వాలాతోరణ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ నిత్యకళావేదిక వద్ద ప్రతిరోజు ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడుతాయి. లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి రోజులలో పుష్కరిణి వద్ద ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతాయి.

# లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు

మనగళం శ్రీశైలం :లోక కల్యాణార్థం పంచమఠాలలో ఈ రోజు (15.09.2025) ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు దంపతులు, అర్చకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.





# అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

- రెవెన్యూ డివిజనల్ అధికారి రాము నాయక్



మనగళం, నంద్యాల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను అధికారులు నాణ్యతతో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి రాము నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక( పి జి ఆర్ ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అధికారులతో కలిసి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ మాట్లాడుతూ పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై తహసీల్దారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని ఆన్లైన్లో నమో చేసి అర్జీ దారునికి రసీదు ఇచ్చి సమస్య పరిష్కరించాలన్నారు. ఇలా చేయడం వల్ల ప్రతి అర్జీదారునికి తప్పక న్యాయం జరుగుతుందన్నారు.

తన భూమిని ఆన్ లైన్ చేయించండి : బనగానపల్లె మండలం, పసుపుల గ్రామానికి చెందిన పి. మద్దిలేటి నాయక్, సర్వే నెంబర్ 61/1లో 67 సెంట్లు భూమి తన పేరు మీద ఉందని, ఈ భూమిని ఆన్లైన్ చేయాలని డీఆర్ఓ కు అర్జీ సమర్పించారు. నంద్యాల మండలం, కానాల గ్రామానికి చెందిన ఎస్. చిన్న గుండయ్య సర్వే నెంబర్ 564 లో 1.56 ఎకరాల భూమి మా పూర్వీకుల నుంచి మా అనుభవంలో ఉందన్నారు. ఈ భూమిని నా పేరుమీద ఆన్లైన్ చేయించాలని డిఆర్ఓకు అర్జీ సమర్పించారు. జూపాడు బంగ్లా మండలం, జూటూరు గ్రామానికి చెందిన ఎం. స్వర్ణలత సర్వే నెంబర్ 215/ఎ, లో రెండు ఎకరాల భూమి నా పేరు మీద ఉందన్నారు. ఈ భూమికి రాస్తా చూపించేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఓ కు అర్జీ సమర్పించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు అర్జీలు సమర్పించారు. సదురు సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని డీఆర్ఓ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లీలావతి, డీఈఓ జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్పైస్‌జెట్ ఉద్యోగులకు జీతాలు చెల్లింపుల్లో ఆలస్యం..!

మనగళం, : ప్రముఖ చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తన ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలో మరోసారి జాప్యం చేస్తోంది. రూ.55,000 వరకు వేతనం కలిగిన జూనియర్ ఉద్యోగులు ఆగస్టు నెలకు సంబంధించి జీతం టైమ్‌కు అందుకోగా.. సీరియర్ సిబ్బంది ఆలస్యంగా జీతాలు అందుకుంటున్నట్లు సమాచారం. కొందరికీ ఇప్పటికీ జీతాలు అందలేదని తెలిసింది. సీనియర్ సిబ్బంది ముఖ్యంగా అసిస్టెంట్ మేనేజర్ స్థాయి, అంతకంటే ఎక్కువ స్థాయిలో ఉన్న వారికి కనీసం 10-15 రోజులు ఆలస్యంగా వేతనాలు అందుతున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై సంస్థ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. గత ఆర్థిక సంవత్సరం స్పైస్‌జెట్ వార్షిక నివేదిక ప్రకారం, సంస్థలో 4,894 మంది శాశ్వత సిబ్బందితో సహా మొత్తం 6,484 మంది ఉద్యోగులు ఉన్నారు. కాగా, గతంలో ఈ సంస్థ అనేకసార్లు తమ ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలో జాప్యం చేసినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.



## డీఐపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జునయ్య



మనగళం, నంద్యాల: సమాచార, పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారి (డీఐపీఆర్వో)గా జె. మల్లికార్జునయ్య పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో డీపీఆర్ఓ గా విధులు నిర్వహిస్తూ కర్నూలు సహాయ సంచాలకులుగా పదోన్నతి పొందారు. దీంతోపాటు నంద్యాల డీఐపీఆర్ఓగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లాలో డీఐపిఆర్వోగా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సలహాలు, సూచనలు పాటిస్తూ.. శాఖా పరంగా, జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యాలయంలో అందరూ బాధ్యతాయుతంగా కలిసికట్టుగా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లా అభివృద్ధిలో తమవంతు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన డీఐపీఆర్వో జె.మల్లికార్జునయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం,,, సిఐటియు




మన గళం గూడూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం గూడూరు పట్టణంలో సిఐటియు మండల మహాసభ గూడూరులోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు గుంటప్ప అధ్యక్షతన జరిగింది ఈ మహాసభకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలు చేసి 44 రకాల కార్మిక హక్కుల చట్టాలను సాధించుకోవడం జరిగింది, నాటి నుండి కార్మికులు తమ హక్కుల కోసం అనేక పోరాటాలు చేసి తమ వేతనాలను తమ హక్కులను సాధించుకున్నారని,, కానీ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశంలోని ప్రభుత్వ రంగాలను, అదాని, అంబానీ లాంటి బడా కార్పోరేట్ పెట్టుబడుదారులకు ప్రైవేటుపరం చేయడానికి కార్మిక చట్టాలు అడ్డుగా ఉన్నాయని వాటిని రద్దు చేయడానికి ప్రయత్నిస్తున్నదని, అందులో భాగంగానే 44 రకాల కార్మిక చట్టాలను రద్దుచేసి కేవలం నాలుగు లేబర్ కోడ్లను అమలు చేసి కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తున్నదని,

లేబర్ కోడ్ ల వలన కార్మికులు తమ హక్కులన్నీ కోల్పోతారని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నం చేసిందని. రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ సమావేశంలో ఎనిమిది గంటల పని విధానం కాదని 10:00 గంటల పని విధానం అమలు చేయాలని. నైట్ డ్యూటీలు మహిళలు కూడా చేయాలని, క్యాబినెట్ సమావేశం తీర్మానించిందని, ఈ తీర్మానం లేబర్ కోడ్ ల అమలులో భాగమేనని, రాష్ట్రవ్యాప్తంగా ఈ తీర్మానాన్ని కార్మికులు వ్యతిరేకించడంతో, రాష్ట్ర ప్రభుత్వం పునరాలచనలు పడిందని. అధికారంలోకి రాకముందు కార్మికులకు అన్ని రకాలుగా న్యాయం చేస్తామని చెప్పి. ఓట్లు వేయించుకొని అధికారం వచ్చినాక కార్మికుల సమస్యలు పట్టించుకోకపోగా కార్మికులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని ఆయన అన్నారు, అనంతరం గూడూరు సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది,, గూడూరు మండల అధ్యక్షుడిగా జే, మోహన్, కార్యదర్శిగా గుంటప్ప, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్,(హమాలి) మద్దిలేటి,(హమాలి) శాంతన్న, (మున్సిపల్ )సహాయ కార్యదర్శులుగా శేషమ్మ,(ఆశా) ప్రభావతి,(%ా%)రాజు (ఆటో) లతోపాటు మొత్తం 21 మందితో మండల కమిటీ ని మహాసభ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు జే,మోహన్, సుబ్బమ్మ, రాజశేఖర్, సుజాత, పద్మ, హమాలి కార్మికులు మధు, మద్దిలేటి, భూత రామాంజనేయులు, దానమన్న, మునెప్ప, వెంకటేశ్వర్లు, కృప, ఆర్పీలు అనసూయ, ప్రభావతమ్మ, మున్సిపల్ కార్మికులు దేవపాల్, గోపాల్, రోజమని, వివో ఏలు చంద్రకళ, వెంకటేశ్వర్లు, సూరన్న, ఆశా వర్కర్ వరలక్ష్మి, స్వచ్ఛభారత్ కార్మికులు దావీదు, అయ్యన్న, మరియు అంగన్వాడి, హమాలి, ఆర్పి, మున్సిపల్, ఆశ, వివో ఏ, ఆటో, స్వచ్ఛభారత్ తదితర కార్మికులు స్థానికులు పాల్గొన్నారు

# మేఘనకు కాంస్యం.. షూటింగ్ ప్రపంచ కప్

మనగళం, నిన్బో(చైనా): ప్రతిష్టాత్మక షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో యువ షూటర్ మేఘన సజ్జనార్ కాంస్య పతకంతో మెరిసింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన తుదిపోరులో మేఘన 230.0 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. గత ఎనిమిదేండ్లలో మేఘనకు ఇది తొలి ప్రపంచకప్ పతకం కావడం విశేషం. ఇదే కేటగిరీలో జిన్లు పెంగ్(255.3, చైనా), డుస్టాట్ డెనెటె(252.6, నార్వే) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. తన దేశానికే చెందిన వాంగ్ జీఫి(254.8) స్కోరును అధిగమిస్తూ చైనా యువ సంచలనం పెంగ్ నయా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఇదిలా ఉంటే భారత్ ఓ స్వర్ణం, కాంస్యంతో ఐదో స్థానంలో కొనసాగుతుంటే.. చైనా (3 స్వర్ణాలు, 4 రజతాలు, కాంస్యం) అగ్రస్థానంలో ఉంది.

# కర్నూలులో భారీగా పట్టుబడిన గంజాయి



మనగళం, కర్నూలు క్రైం : జిల్లా కేంద్రం కర్నూలులో భారీగా గంజాయి పట్టుబడింది. కర్నూలు మండలం పంచలిం గాల గ్రామానికి చెందిన వారు ఆ గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని గంజాయి వ్యాపారాన్ని కొనసా గిస్తున్నారు. మూడు రోజుల క్రితం స్నేహితులతో కలసి కారు లో అరకు వెళ్లి అక్కడ గంజాయి కొనుగోలు చేసి కర్నూలు మీదుగా పంచలింగాలకు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కర్నూలు 4వ పట్టణ సీఐ విక్రమసింహ ఆధ్వర్యంలో బళ్లారి చౌరస్తా ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైన ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహిం చారు. గంజాయి తరలిస్తున్న కారును స్వాధీనం చేసు కున్నారు. కారుకు ఉన్న నాలుగు డోర్ల వెనుకభాగం లో 49 ప్యాకెట్ల గంజాయిని పట్టుకున్నారు. డోర్ లాక్ హ్యాండిల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్సో గంజాయి పొట్లాలను భద్రపరిచారు. క్యూఆర్టీ వాహనంతో పాటు ఓ లారీని హైదరాబాద్-బెంగ ళూరు జాతీయ రహదారిపై అడ్డంగా నిలిపి అనుమా నాస్పద కారును తనిఖీ చేయగా గంజాయి బయటప డింది. డోర్లు లాక్ లు తెరుచుకోకపోవడంతో మెకానిక్ ని పిలిపించి వెనుక భాగంలో ఉన్న గంజాయి పొట్లాలను వెలికి తీశారు. కారులో ఉన్న వ్యాపారి తో పాటు స్నేహితులు కర్నూలు ధర్మపేటకు చెందిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. కల్లూరు తహసీల్దారు ఆంజనేయులు, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి సమక్షంలో పంచానామా నిర్వహించి పోలీసులు కేసు నమోదు చేశారు.

# హైజంప్ ఫైనల్లో అనిల్.. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



మనగళం, టోక్యో: ప్రతిష్టాత్మక ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ సర్వేశ్ అనిల్‌కుశారె అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల హైజంప్ విభాగంలో ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఈ ఫీట్ అందుకున్న తొలి భారత అథ్లెట్‌గా అనిల్ నిలిచాడు. అర్హత రౌండ్‌లో గ్రూపు-బీ నుంచి పోటీపడ్డ 30 ఏండ్ల కుశారె 2.25 మీటర్ల ఎత్తు దూకి సంయుక్తంగా ఏడో స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా రెండు గ్రూపుల నుంచి అనిల్‌కు తొమ్మిదో స్థానం దక్కింది. మంగళవారం హైజంప్ ఫైనల్ జరుగనుంది. ఇందులో 2.30 మీటర్ల క్వాలిఫయింగ్ మార్క్ లేదా 12 అత్యుత్తమ ప్రదర్శనలను పరిగణనలోకి తీసుకుంటారు. 2022లో కుశారె 2.27మీటర్లతో తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. మహారాష్ట్రలోని నాసిక్‌లోని సాధారణ రైతు కుటుంబానికి చెందిన అనిల్ చాలా కష్టపడి పైకి వచ్చాడు. పారిస్(2024) ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత హైజంపర్‌గా నిలిచిన ఈ యువ అథ్లెట్ తాజాగా ప్రపంచ అథ్లెటిక్స్‌లోనూ సత్తాచాటుతున్నాడు. మరోవైపు పురుషుల 10వేల మీటర్ల రేసులో గుల్వీర్‌సింగ్ 16వ స్థానంలో నిలిచి నిరాశపరిచాడు.

## అందుకే పాక్ ఆటగాళ్లతో కరచాలనం చేయలేదు: సూర్యకుమాం



మనగళం,: నిన్న పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు ప్రత్యర్థి టీం సభ్యులను అస్సలు పట్టించుకోలేదు. పలకరింపులు, నవ్వులు, కరచాలనాలు వంటివేమీ లేకుండా ఆట ముగించారు. తమ పని తాము చేసుకుని మైదానాన్ని వీడారు. ఈ విషయంపై టీమిండియా కప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తాజాగా వివరణ ఇచ్చారు

పాక్ క్రీడాకారులకు టీమిండియా సభ్యులు షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడంపై ఓ విలేకరి సూర్యకుమార్ యాదవ్‌ను ప్రశ్నించారు. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధం కాదా అని ప్రశ్నించారు. దీనికి సూర్యకుమారు సూటిగా జవాబిచ్చారు. కొన్ని అంశాలు క్రీడాస్ఫూర్తికంటే ముఖ్యమైనవని కుండబద్దలు కొట్టారు. 'జీవితంలో కొన్ని అంశాలు క్రీడాస్ఫూర్తికంటే ముఖ్యమైనవి. పహల్గాం దాడి బాధితులకు మేము అండగా ఉంటాము. కాబట్టి, ఈ విజయాన్ని మేము ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సాయుధ దళాలకు అంకితం ఇస్తున్నాము' అని అన్నారు .పాక్ క్రీడాకారులకు షేక్ హ్యాండ్ ఇవ్వొద్దనేది ప్లాన్ ప్రకారం తీసుకున్న ముందస్తు నిర్ణయమని సూర్యకుమార్ పరోక్షంగా హింట్ ఇచ్చారు. 'ఈ మ్యాచ్ విషయంలో భారత ప్రభుత్వం, బీసీసీఐ మధ్య ఏకాభిప్రాయం ఉంది. ఇక మిగతా విషయాలను వస్తే .. మేమిక్కడకు వచ్చాక నిర్ణయం తీసుకున్నాము. ఇక్కడకు మేదు ఆడటానికి వచ్చాము. ఈ దిశగా సరైన బదులిచ్చామనే అనుకుంటున్నాము' అని సూర్యకుమార్ అన్నాడు . ఇక అవార్డుల ప్రదానం తరువాత జరిగిన కార్యక్రమంలో పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా కూడా పాల్గొనలేదు. ఈ విషయమై పాక్ హెడ్ కోచ్ మైక్ హెస్సన్ స్పందించారు. టీమిండియా సభ్యులు తమతో కరచాలనం చేయకపోవడం పాక్ జట్టు సభ్యులను నిరాశపరిచిందని అన్నారు. ఈ క్రమంలోనే సల్మాన్ కూడా మ్యాచ్ తరువాత జరిగిన వేడుకకు వెళ్లలేదని చెప్పారు.

పహల్గాం దాడి తరువాత పాక్‌తో మ్యాచ్‌కు అంగీకరించినందుకు బీసీసీఐపై విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. అయితే, పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఉండవని బీసీసీఐ స్పష్టం చేసింది. పాక్‌తో పాటు ఇతర దేశాల జట్లు కూడా ఆడే టోర్నీల్లో భారత్ పాలుపంచుకుంటుందని వివరణ ఇచ్చింది. ఈ నేపథ్యంలో మ్యాబ్ ముందు ప్రీ టోర్నమెంట్ కాన్ఫరెన్స్‌లో పాక్ కెప్టెన్‌తో సూర్యకుమార్ కరచాలనం చేయడం కూడా వివాదానికి దారి తీసింది.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310